క్లుప్తంగా

విద్యార్థుల్లో నైపుణ్యం పెంపొందాలి



కె.తాడేపల్లి(విజయవాడ రూరల్): విద్యార్థుల్లో సాంకేతిక నైపుణ్యం పెంపొందాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ట్యాబ్‌లను అందజేస్తోందని జెడ్పీటీసీ కె.సువర్ణరాజు అన్నారు. కొత్తూరు తాడేపల్లి గ్రామంలోని ఏపీఎం జెడ్పీ హైస్కూల్లో 8వ తరగతి విద్యార్థులు 57 మందికి ప్రభుత్వ ట్యాబ్‌లను గురువారం రెండో విడత పంపిణీ చేశారు. సర్పంచి ఉయ్యూరు గోపాలరావు మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకొని చదువులో రాణించాలన్నారు. కేసీసీబీ డైరెక్టర్ ఎల్.పుండరీక వర్మ, నాయకులు కర్నాటి రాంబాబు, విద్యా కమిటీ చైర్మన్ షేక్ బాజీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా రాములోరి గ్రామోత్సవం

చిలుకూరువారిగూడెం(మైలవరం): మైలవరం మండలం చిలుకూరువారిగూడెం గ్రామంలో సీతారాముల విగ్రహాలను భక్తులు పల్లకీపై ఉంచి గురువారం గ్రామోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ నెల 17 నుంచి తొమ్మిది రోజుల పాటు గ్రామంలోని సీతారామాంజనేయ ఆలయంలో బూరుగుల కృష్ణ కిశోర్ శర్మ రామాయణ ప్రవచనం చేశారు. ఈ సందర్భంగా శాంతి కల్యాణం, గ్రామోత్సవం అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఉపాధ్యాయిని గంగాభవానీకి పీహెచ్‌డీ ప్రదానం



కొండపల్లి(ఇబ్రహీంపట్నం): డీఏవీ పాఠశాల తెలుగు ఉపాధ్యాయిని దూపం గంగాభవానీకి ఆచార్య నాగార్జున యూనివర్సిటీ తెలుగు సాహిత్యంలో పీహెచ్‌డీ డిగ్రీ ప్రదానం చేశారు. తెలుగు, ప్రాచ్య భాషా విభాగంలో ఆచార్య విరవని మాధవి పర్యవేక్షణలో కనమలూరి వెంకట శివయ్య రచనలు–సమీక్ష అంశంపై పరిశోధన చేసిన గ్రంథాన్ని యూనివర్సిటీకి అందజేశారు. ఈ మేరకు నిర్వహించిన మౌఖిక పరీక్ష విజయవంతంగా పూర్తి చేయడం ద్వారా ఆమె డాక్టరేట్ పొందారు. ఈ సందర్భంగా ఆమెను పాఠశాల ప్రిన్సిపాల్ మన్మోహన్, ఇన్‌చార్జ్ ఇందిరప్రియ, ఉపాధ్యాయులు అభినందించారు.

వైభవంగా వేణుమాధవుని కల్యాణం



నెమలి(గంపలగూడెం): నెమలి వేణుగోపాల స్వామి ఆలయంలో గురువారం స్వామి వారి మాస కల్యాణం ఘనంగా నిర్వహించారు. 10 మంది దంపతులు పీటలపై కూర్చుని కన్యాదానం చేశారు. స్వామి వారి కల్యాణం విశిష్టతను ప్రధాన అర్చకులు తెలిపారు. ఆలయ సహాయ కమిషనర్ డి. శ్రీరామవరప్రసాదరావు, భక్తులు పాల్గొన్నారు.

వేంకటాచలస్వామికి గరుడ వాహన సేవ

తిరువూరు: స్థానిక పాత తిరువూరులోని వేంకటాచలస్వామి ఆలయంలో పుష్యమాస పౌర్ణమి సందర్భంగా గురువారం గరుడ వాహన సేవ నిర్వహించారు. ఆలయ అర్చకుడు దేవయాజనం వేణుగోపాలాచార్యులు ఆధ్వర్యంలో స్వామి వారికి పూజాదికాలు చేసి గరుడవాహనంపై ఊరేగించారు. పలు రకాల నివేదనలు సమర్పించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

కబడ్డీ విజేత కోకిలంపాడు జట్టు



తిరువూరు: ఆడుదాం ఆంధ్రా పోటీల్లో భాగంగా గురువారం స్థానిక జెడ్పీ బాలికోన్నత పాఠశాల ఆవరణలో జరిగిన నియోజకవర్గ స్థాయి కబడ్డీ టోర్నమెంట్‌లో కోకిలంపాడు జట్టు విజయం సాధించింది. నియోజకవర్గంలోని నాలుగు మండలాల నుంచి వచ్చిన టీంలు హోరాహోరీ తలపడగా ఫైనల్స్‌లో కోకిలంపాడు జట్టు గెలుపొందిందని నిర్వాహకులు ప్రకటించారు. ఈనెల 27, 29 తేదీల్లో క్రికెట్, బ్యాడ్మింటన్ పోటీలు జరుగుతాయని అధికారులు చెప్పారు.

ఓటుతో ప్రజాస్వామ్య విలువలు కాపాడాలి

- ఘనంగా ఓటర్ల దినోత్సవం
- సీనియర్ ఓటర్లకు సన్మానాలు
- పలుచోట్ల ర్యాలీలు, అవగాహనా సదస్సులు



నూజివీడులో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్

మైలవరం: ఓటుతో ప్రజాస్వామ్య విలువలు కాపాడాలని వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.హరినాథరెడ్డి అన్నారు. మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో గురువారం జాతీయ ఓటర్ల దినోత్సవం నిర్వహించారు. డాక్టర్ హరినాథరెడ్డి మాట్లాడుతూ నవ సమాజ నిర్మాణానికి ఓటు ఆయుధమని, దీనిని వినియోగించడం ద్వారా ప్రజాస్వామ్యంలో విలువలు పెంపొందించాలన్నారు. అనంతరం కళాశాల విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ బి.శివహరిప్రసాద్, ఇన్‌చార్జి పి. సోమరాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

- చంద్రాల(మైలవరం): సామాన్యులకు ఓటు హక్కే ప్రధాన ఆయుధమని వైఎస్సార్ సీపీ రైతు విభాగం ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు జొన్నలగడ్డ గంగాధరరావు అన్నారు. చంద్రాల గ్రామ పోలింగ్ కేంద్రాల్లో సర్పంచ్ జె. జ్యోతి అధ్యక్షతన జాతీయ ఓటర్ల దినోత్సవం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ ఓటర్లను సత్కరించారు. అనంతరం ఓటర్లతో ప్రతిజ్ఞ చేయించారు. బీఎల్‌ఓలు, ఉపాధ్యాయులు, ఓటర్లు పాల్గొన్నారు.
- విస్సన్నపేట: ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని, 18 సంవత్సరాలు నిండిన ప్రతి వారూ ఓటు నమోదు చేసుకోవాలని తహసీల్దార్ చంద్రశేఖర్ అన్నారు. స్థానిక జెడ్పీ హైస్కూల్లో జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. సీనియర్ ఓటర్లను సన్మానించి నూతనంగా ఓటు హక్కు పొందిన వారికి ఓటు కార్డులు అందజేశారు.



ప్రతిజ్ఞ చేస్తున్న లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు



విస్సన్నపేటలో సీనియర్ ఓటర్లను సన్మానిస్తున్న తహసీల్దార్ చంద్రశేఖర్

ఓటు హక్కు సామాజిక బాధ్యత

ఇబ్రహీంపట్నం: ఓటు హక్కు సామాజిక బాధ్యత అని, ప్రతిఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని జాకీర్‌హుస్సేన్ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ ఎస్.మహబూష అన్నారు. స్థానిక కళాశాలలో జాతీయ ఓటర్ల దినోత్సవం సచివాలయ సిబ్బంది, ఎన్ఎస్ఎస్ వలంటీర్ల ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. కార్యక్రమంలో వీఆర్వోలు, బీఎల్వోలు, సచివాలయ, కళాశాల ఉద్యోగులు పాల్గొన్నారు.

ఓటుహక్కును వినియోగించుకోవాలి

నూజివీడు: ఓటర్లంతా ఓటుహక్కును వినియోగించుకోవాలని సబ్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ అన్నారు. స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో గురువారం జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సమాజం పట్ల అవగాహన కలిగి ఉండి స్వచ్ఛమైన పాలనను అందించేవారిని ఎన్నుకోవాలన్నారు. ఇప్పటికి అర్హత ఉండి ఓటుహక్కు లేనివారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అనంతరం సీనియర్ ఓటర్లను సబ్ కలెక్టర్ సన్మానించారు. మోడల్ పోలింగ్ స్టేషన్‌ను, ఓటర్ల నమోదు కేంద్రం స్టాల్స్‌ను ప్రదర్శించారు. మున్సిపల్ కమిషనర్ సయ్యద్ అబ్దుల్ రషీద్, తహసీల్దార్ డీవీఎస్ యల్లారావు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

- చాట్రాయి: చాట్రాయి జెడ్పీ హైస్కూల్లో జాతీయ ఓటరు దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ ఓటర్లను ఘనంగా సన్మానించి గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ వై.రంగారావు, సర్పంచ్ దామెర ఉషా, ఎంపీటీసీ సంకు శివకుమారి, ఎంపీడీఓ దుర్గా ప్రసాదు, ఎంఈఓ బ్రహ్మాచారి తదితరులు పాల్గొన్నారు. పోలవరంలో పీఏసీఎస్ చైర్మన్ సీనియర్ ఓటర్లను సన్మానించారు.
- ముసునూరు: తహసీల్దార్ దాసరి సుధ ఆధ్వర్యంలో మండలంలోని పలు చోట్ల ఓటు హక్కుపై అవగాహన, వినియోగంపై ర్యాలీలు నిర్వహించి, సీనియర్ ఓటర్లను ఘనంగా సన్మానించారు. కొత్త ఓటర్లకు గుర్తింపు కార్డులను పంపిణీ చేశారు. ఎంపీపీ దుర్గాభవాని, జెడ్పీటీసీ డా.వరికూటి ప్రతాప్, వైస్ ఎంపీపీలు రాజానాయన, గంగాధరరావు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు నాగవల్లేశ్వరరావు, సర్పంచ్‌లు, నాయకులు పాల్గొన్నారు.
- తిరువూరు: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం సీనియర్ ఓటర్లను నగర పంచాయతీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. తిరువూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సుశీలరావు మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటుహక్కు పొందాలన్నారు. నగర పంచాయతీ కమిషనర్ బాలకృష్ణ, టీపీఓ జగదీష్, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఆసరాతో మహిళల జీవితాల్లో వెలుగులు

ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు



సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు

ఆగిరిపల్లి: వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్షలాది మంది స్వయం సహాయక మహిళల జీవితాల్లో వెలుగులు నింపారని ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. ఆగిరిపల్లి జెడ్పీ హైస్కూల్‌లో గురువారం నాలుగో విడత వైఎస్సార్ ఆసరా చెక్కును డ్వాక్రా మహిళలకు అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ డ్వాక్రా అక్కచెల్లెమ్మలకు నాలుగు దశల్లో పూర్తిగా రుణమాఫీ చేస్తానని చెప్పిన మాటను నెరవేర్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని తెలిపారు. చంద్రబాబు డ్వాక్రా రుణాలను మాఫీ చేస్తానని చెప్పి మాట తప్పి మహిళలను మోసం చేశారన్నారు. తీసుకున్న అప్పులు బ్యాంకుకు చెల్లించకపోవడంతో మహిళలు తాళిబొట్లు అమ్ముకుని బ్యాంకులకు వడ్డీతో సహా చెల్లించారని గుర్తు చేశారు. ఇప్పుడు కూడా చంద్రబాబు అన్ని ఫ్రీ అంటూ మళ్లీ మోసం చేయడానికి వస్తున్నారని, మహిళలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. మండలంలో మొత్తం 1,237 స్వయం సంఘాలకు చెందిన 12,734 మంది సభ్యులకు నాలుగో విడత కింద రూ.12,55,67,440 విలువైన చెక్కును మహిళలకు అందజేశారు. ఈ సందర్భంగా పొదుపు సంఘాల మహిళలు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ గోళ్ల అనూష, జెడ్పీటీసీ పిన్ని బోయిన వీరబాబు, వైస్ ఎంపీపీ కొండవరదల రమేష్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు పల్లగాని నరసింహారావు, జిల్లా కార్యదర్శి మచ్చా హరిబాబు, తహసీల్దార్ ఉదయభాస్కర్, ఎంపీడీఓ శంకరరావు, ప్రజాప్రతినిధులు, పలు విభాగాల నాయకులు పాల్గొన్నారు.

మల్లయ్యస్వామికి ఎంపీ కేశినేని నాని ప్రత్యేక పూజలు



మల్లయ్యస్వామి ఆలయం వద్ద ఎంపీ కేశినేని నాని, నల్లగట్ల స్వామిదాసు

కొండపర్వ (విస్సన్నపేట): కొండపర్వ గ్రామంలోని భ్రమరాంబ మల్లికార్జున స్వామి (మల్లయ్య స్వామి) దేవస్థానం, ఆంజనేయస్వామి దేవస్థానం వద్ద విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శ్రీనివాసరావు (నాని), వైఎస్సార్ సీపీ తిరువూరు నియోజకవర్గ ఇన్‌చార్జి నల్లగట్ల స్వామిదాసు గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సొసైటీ అధ్యక్షుడు జి. చంద్రశేఖరరావు వారికి స్వాగతం పలికారు. అనంతరం పుట్రేల గ్రామంలోని మారెమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారికి ఆలయ చైర్మన్ కోటగిరి సునీల్ బాబు, ఈఓ సీతారామయ్యలు అమ్మవారి చిత్రపటం, ప్రసాదం అందజేశారు. ఏఎంసీ మాజీ చైర్మన్ మద్దిరెడ్డి సూర్యనారాయణరెడ్డి, ఎంపీపీ పిల్లి మెర్సీ వనజాక్షి, జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ నల్లగట్ల సుధారాణి, కేడీసీసీబీ డైరెక్టర్ భూక్యా రాణి, పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

మళ్లీ వైఎస్ జగనే సీఎం

ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకట ప్రతాప్ అప్పారావు

నూజివీడు: రానున్న ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలు మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి పట్టం కట్టడం ఖాయమని ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. నూజివీడులోని ఎమ్మెల్యే కార్యాలయం ఆవరణలో గురువారం నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలతో విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర చరిత్రలో ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నింటిని అధికారం చేపట్టిన తరువాత అమలు చేసిన ఏకైక సీఎం వైఎస్ జగన్ అని అన్నారు. రాష్ట్రంలోని ప్రతిపక్ష పార్టీలన్నీ కలిసి వచ్చినా వైఎస్సార్ సీపీని ఏమీ చేయలేవన్నారు. ఈనెల 30న ఏలూరులో నిర్వహించనున్న సీఎం వైఎస్ జగన్ బహిరంగ సభకు పెద్దఎత్తున కార్యకర్తలు, నాయకులు తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు.రాష్ట్ర ప్రజల నమ్మకాన్ని కోల్పోయిన వ్యక్తి చంద్రబాబు అని, టీడీపీని చిత్తుగా ఓడించడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. టీడీపీకి ఇప్పటికి కూడా రాష్ట్రంలో అభ్యర్థులు దొరకడం లేదని, దీనిని బట్టే ఆ పార్టీ దుస్థితి అర్థమవుతోందన్నారు. ఇక్కడి టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ముద్దరబోయిన వెంకటేశ్వరరావు నియోజకవర్గంలో అభివృద్ధి జరగడం లేదని అసత్య ప్రచారం చేస్తున్నారని, అభివృద్ధిపై తాను చర్చకు సిద్ధమని చెప్పారు. ఏపీ స్టేట్ కో–ఆపరేటివ్ యూనియన్ లిమిటెడ్ చైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి, వైఎస్సార్ సీపీ నూజివీడు పట్టణ, ముసునూరు, ఆగిరిపల్లి, చాట్రాయి మండలాల అధ్యక్షులు శీలం రాము, మూల్పూరి నాగవల్లేశ్వరరావు, పల్లగాని నరసింహారావు, మిద్దే బాలకృష్ణ, జెడ్పీ వైస్ చైర్మన్ గుడిమళ్ల కృష్ణంరాజు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, పలు విభాగాల అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు

మైలవరం: ఆడుదాం ఆంధ్రా మైలవరం నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలు ఉత్సాహంగా జరిగాయి. మహిళా కబడ్డీ విభాగంలో ప్రథమ స్థానం మైలవరం మండలం, ద్వితీయ స్థానం జీ.కొండూరు మండలం, తృతీయ స్థానం ఇబ్రహీంపట్నం మండలం, మహిళల షటిల్ బ్యాడ్మింటన్ విభాగంలో ప్రథమ స్థానం మైలవరం మండలం, ద్వితీయ స్థానం ఇబ్రహీంపట్నం, తృతీయ స్థానం జి.కొండూరు మండలం, మహిళల ఖోఖో విభాగంలో ప్రథమ స్థానం మైలవరం మండలం, ద్వితీయ స్థానం జి.కొండూరు మండలం, తృతీయ స్థానం ఇబ్రహీంపట్నం మండలం, వాలీబాల్ విభాగంలో ప్రథమ స్థానం మైలవరం మండలం, ద్వితీయ స్థానం జి.కొండూరు మండలం, పురుషుల క్రికెట్ మ్యాచ్‌లో మొదటి మ్యాచ్‌లో వెల్వడం–1 జట్టు, రెండో మ్యాచ్‌లో జక్కంపూడి టీమ్ విజయం సాధించాయి.

క్రీడాకారుల ప్రతిభ..

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): మైలవరంలో బుధవారం జరిగిన పోటీల్లో కొండపల్లి సచివాలయం–5 బ్యాడ్మింటన్ జట్టు విజయం సాధించి జిల్లా స్థాయికి దూసుకెళ్లింది. పురుషుల ఖోఖో జట్టు రన్నర్స్‌గా నిలిచి రూ.15 వేల నగదు ప్రోత్సాహానికి అర్హత సాధించింది. సచివాలయ–3 ఖోఖో మహిళా జట్టు తృతీయ స్థానంలో నిలిచింది. విజేతలను ఆర్ఐ రవితేజ, పీఈటీ హేమ, కౌన్సిలర్ దయాసాగర్ అభినందించారు.

ప్రశాంతమైన జీవనంతో ఆత్మ సంతృప్తి



జూపూడి(ఇబ్రహీంపట్నం): విలువలతో కూడిన జీవితం ప్రశాంతంగా ఉంటుందని, ప్రశాంతమైన జీవనం ఆత్మ సంతృప్తిని ఇస్తుందని ఆర్ఈఆర్ఎఫ్ ఎడ్యుకేషనల్ చైర్మన్ బ్రహ్మకుమారి రాజయోగిని అన్నారు. జూపూడి నిమ్రా కళాశాలలో ఒత్తిడి, కోపాన్ని జయించడం ఎలా అనే అంశంపై గురువారం ఆమె ప్రసంగించారు. ప్రతి మనిషి ధనం, ఆరోగ్యం కోల్పోయినా జీవించవచ్చని, వ్యక్తిత్వం కోల్పోతే సమాజంలో బతకడం కష్టమని వివరించారు. కళాశాల వైస్ చైర్మన్ మహ్మద్ సాదిల్ రసూల్‌ఖాన్ ఆమెను ఘనంగా సన్మానించారు.

30న మండల పరిషత్ సమావేశం

ముసునూరు: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 30న ఉదయం 10 గంటలకు జరుగుతుందని ఎంపీడీఓ జి.రాణి గురువారం తెలిపారు. సమావేశానికి సభ్యులు, ఆయా శాఖల అధికారులు సకాలంలో హాజరుకావాలని కోరారు.

శాస్త్రోక్తంగా సీతారాముల కల్యాణం

తిరువూరు: భద్రాచలం సీతారామచంద్రస్వామి శాంతి కల్యాణాన్ని తిరువూరు రాజుపేటలో గురువారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. శ్రీరామభక్త బృందం ఆధ్వర్యంలో స్వామి వారి చిత్రపటాలకు నగరోత్సవం నిర్వహించిన అనంతరం భద్రాచల సీతారామచంద్రస్వామి ఆలయ వేద పండితులు కల్యాణోత్సవాన్ని జరిపారు. పలువురు దంపతులు పీటలపై కూర్చుని కల్యాణం జరిపించారు. అనంతరం భక్తబృందం ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

రైతుబజారు పరిశీలన

మైలవరం: మైలవరం రైతు బజారులో నూతనంగా నిర్మాణంలో ఉన్న షాపులను స్థానిక వైస్ ఎంపీపీ షేక్ అబ్దుల్ రహీమ్ గురువారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ షాపుల నిర్మాణం పనులు వేగంగా జరుగుతున్నాయని చెప్పారు. వార్డు సభ్యులు రాము, బచ్చు సుబ్బారావు, ప్రభుత్వ ఆస్పత్రి డైరెక్టర్ జగ్జీవన్‌రావు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

మోహనరావు సేవలు ప్రశంసనీయం

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి మాజీ సర్పంచి మామిడి వెంకట మోహనరావు గ్రామానికి చేసిన సేవలు మరువలేనివని జన విజ్ఞాన వేదిక జిల్లా ఉపాధ్యక్షుడు పి.కామేశ్వరరావు అన్నారు. స్థానిక మోహనరావు నగర్‌లో గురువారం జరిగిన వర్ధంతి కార్యక్రమంలో ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎస్టీ కాలనీ ఏర్పాటు, ఎన్టీటీపీఎస్ స్థలం సేకరణ, గ్రామ అభివృద్ధికి ఆయన ఎనలేని కృషి చేశారని వివరించారు. గత ఏడాది పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు పురస్కారం అందజేశారు. మామిడి సీతారామారావు, మాజీ సర్పంచి వెనిగళ్ల అమ్మాజీ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా పోటీలకు ముసునూరు క్రీడాకారుల ఎంపిక

ముసునూరు: నూజివీడులో నిర్వహించిన ఆడుదాం ఆంధ్రా నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీల్లో ముసునూరు జట్టు ప్రతిభ చూపి జిల్లా పోటీలకు ఎంపికయ్యాయని ఎంపీడీఓ జి.రాణి తెలిపారు. వాలీబాల్ మహిళల విభాగంలో ముసునూరు–2 జట్టు నియోజకవర్గ స్థాయిలో విజేతగా నిలిచి జిల్లా పోటీలకు అర్హత సాధించిందన్నారు. క్రికెట్ పోటీల్లో ముసునూరు మండల జట్టు, నూజివీడు మండల జట్టుపై గెలిచి ఫైనల్‌కు చేరుకుందని చెప్పారు. ఈ నెల 27న జరిగే ఫైనల్ పోటీలో ఆగిరిపల్లి మండల జట్టుతో తలపడనుందని వివరించారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీలు

చాట్రాయి: వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని ఎస్ఐ స్వామి తెలిపారు. గురువారం రాత్రి మండలంలోని కృష్ణారావుపాలెం రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టు వద్ద వాహనాల తనిఖీలను ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల దృష్ట్యా అక్రమంగా మద్యం, నగదు తరలించే వాహనాలను తనిఖీలు నిర్వహించాలని సిబ్బందిని ఆదేశించారు.

ఎస్ఐ కుటుంబరావు బదిలీ

ముసునూరు: ముసునూరు ఎస్ఐ ఎం.కుటుంబరావు చింతలపూడికి బదిలీ అయ్యారు. ఆయనను ముసునూరు నుంచి చింతలపూడికి బదిలీ చేస్తూ ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వెలువడగా గురువారం సాయంత్రం ఆయన బాధ్యతల నుంచి రిలీవ్ అయ్యారు. శుక్రవారం చింతలపూడిలో బాధ్యతలు స్వీకరించనున్నట్లు కుటుంబరావు తెలిపారు. ఆయన స్థానంలో కాకినాడ జిల్లాకు చెందిన వాసు బదిలీపై రానున్నట్లు సమాచారం.

నేడు మాంసం విక్రయాలపై నిషేధం

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): రిపబ్లిక్ డే సందర్భంగా కొండపల్లి మున్సిపాల్టీ పరిధిలో శుక్రవారం మాంసం విక్రయాలు నిషేధించామని మున్సిపల్ కమిషనర్ సీహెచ్ వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. చేపలు, గుడ్లు, రొయ్యలు అమ్మడం, కొనడం చేయరాదన్నారు. బిర్యానీ హోటల్స్ కూడా మూసివేయాలని చెప్పారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

డ్రైడేగా పాటించాలి

ముసునూరు: రిపబ్లిక్ డేను డ్రైడేగా పాటిస్తూ, వైన్ షాపులను మూసివేయాలని తహసీల్దార్ దాసరి సుధ, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో నూజివీడు ఇన్‌స్పెక్టర్ పీవీ రమణ అన్నారు. గురువారం విలేకరులతో వారు మాట్లాడారు. అక్రమంగా మద్యం, మాంసం విక్రయాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

తలనీలాల సేకరణకు వేలం

రూ.11.20 లక్షల ఆదాయం

నెమలి(గంపలగూడెం): నెమలి వేణుగోపాలస్వామి ఆలయంలో భక్తులు సమర్పించిన తలనీలాలను పోగు చేసుకునే హక్కునకు గురువారం వేలం నిర్వహించారు. హైదరాబాద్‌కు చెందిన బొజ్జా శ్రీనివాసరావు అత్యధికంగా పాడి వేలం దక్కించుకున్నాడు. వేలం ద్వారా రూ.11.20 లక్షల ఆదాయం లభించిందని ఆలయ సహాయ కమిషనర్ దాసరి శ్రీరామ వరప్రసాదరావు తెలిపారు. ఈ నెల 26 నుంచి డిసెంబరు 31 వరకు ఆలయంలో భక్తులు సమర్పించిన తలనీలాలను పోగు చేసుకునే హక్కు పాటదారుకు కలిగింది. తిరువూరు గ్రూపు దేవాలయాల మేనేజరు జన్ను వెంకటేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.











